క్లుప్తంగా

తాటిచెట్లపాలెంలో మహా అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్ల పాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం మహా అన్నదానం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు విష్ణుకుమార్‌రాజు పాల్గొని, అన్నదానాన్ని ప్రారంభించారు. ఇటీవల జరిగిన హనుమాన్ జయంతి ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఈ అన్నదానం నిర్వహించినట్లు, సుమారు మూడువేల మంది వరకు ఈ అన్నదానంలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహా అన్నదానం రాపేటి అప్పలనాయుడు, సింహలక్ష్మి జ్ఞాపకార్థం రాపేటి గోవింద్, రాజ్యలక్ష్మి దంపతులు నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, సెక్రటరీ ఎం. సూర్యనారాయణ, కోశాధికారి వై. రామ అప్పారావు, కమిటీ సభ్యులు పలిశెట్టి అప్పన్న, ఎం. ఈశ్వర్రావు, దాసు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ చిత్రపటాల పంపిణీ

సీతంపేట: జీవీఎంసీ 26వవార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి కార్యాలయంలో మంగళవారం ఎన్‌టీఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులకు, కార్యకర్తలకు ఎన్.టి.ఆర్ చిత్రపటాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాల నాయుడు, వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే మళ్ల బర్త్‌డే



మళ్ల విజయప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సీతమ్మధార : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, ఏపీఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ డాక్టర్ మళ్ల విజయప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సీతమ్మధారలోని ఆయన నివాసంలో పార్టీశ్రేణులు, కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేశారు. జన్మదిన వేడుకలకు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరై మళ్లకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపు



సీతమ్మధార రైతుబజారు వద్ద బడ్డీలు తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ జోన్-3 పరిధిలోని పలు వార్డుల్లో ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు తొలగించారు. టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సీతమ్మధార రైతుబజారు వద్ద ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఈ మేరకు పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి బడ్డీలు, వాల్‌పోస్టర్లు తొలగించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా పోస్టర్లు అతికిస్తే ఫైన్ వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరకొర సిబ్బందితో అవస్థలు

- అధ్వానంగా జోన్-5లో పారిశుధ్య పనులు
- కార్మికులను పెంచాలని ప్రజల డిమాండ్



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో గల 24 వార్డులకు సంబంధించి పారిశుధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్, కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, ఎన్ఏడీ కొత్తరోడ్డు, మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా ప్రాంతాల్లో జనసంచారంతో పాటు వ్యాపారాలు అధికం. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎక్కువగా ఉంది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డుల విస్తీర్ణం పెరిగినా పారిశుధ్య కార్మికులు పెరగకపోవడంతో ఉన్న కార్మికులతోనే పనులు నెట్టుకొస్తున్నారు. వీరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పర్యవేక్షిస్తుంటారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

జోన్ పరిధిలో 24 వార్డులకు సంబంధించి 24 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాలి. కానీ ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఔట్‌సోర్సింగ్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పబ్లిక్‌హెల్త్ మేస్త్రీలు, ఒక పబ్లిక్‌హెల్త్ వర్కర్ వార్డులో విధులు నిర్వహిస్తున్నారు. వార్డులో కార్మికులు సరిపడక విశ్రాంత సిబ్బందితో ఆఫ్టింగ్ విధానంలో పనులు చేయిస్తున్నారు. సిబ్బంది సెలవు పెడితే గల్లీలు దుర్గంధంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అవగాహన లేని మలేరియా, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనులు చేయిస్తుండడంతో కొన్ని వార్డుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.
- జోన్ 5లో సరిపడినంత మంది పారిశుధ్య కార్మికులు లేక గెడ్డలు, కల్వర్టుల్లో చెత్తా చెదారాలు పేరుకుపోతున్నట్లు చెబుతున్నారు.
- తడి-పొడి చెత్త సేకరణ, గల్లీలో రోడ్లు, కాలువలు శుభ్రపరచడానికి ఉన్న సిబ్బందితోనే కాలం గడిపేస్తున్నారు.
- పరిస్థితులు ఇప్పుడే ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో మరీ దారుణంగా ఉంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎక్కువ మంది పారిశుధ్య కార్మికులను కేటాయించాలని అడగని వార్డు కార్పొరేటర్ల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి, పర్యవేక్షించాలని అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



జోన్-5 పరిధి అధికం కావడంతో పారిశుధ్య కార్మికుల కొరత కొంత వరకు ఉంది. ఇప్పటికే వార్డుల వారీగా సిబ్బందిని సర్దుబాటు చేస్తూ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. వార్డుల్లో సిబ్బందిని నియమించేందుకు జోన్ పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకుని జాబితాను తయారు చేశాం. కొత్త సిబ్బందిని నియమించేందుకు జీవీఎంసీ కమిషనర్, మేయర్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. త్వరలో కొత్త సిబ్బందిని నియమించేందుకు కృషి చేస్తాం.

-ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5, జ్ఞానాపురం

జోన్ 5 పరిధిలో 24 వార్డులకు సంబంధించిన శాశ్వత, ఔట్‌సోర్సింగ్, నైట్ కార్మికులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది విధుల నిర్వహణ ఇలా..

వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్‌సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్‌వైజర్లు	డిప్యుటేషన్
40వ వార్డు	00	09	09	00	01
41వ వార్డు	17	18	35	04	01
42వ వార్డు	15	31	46	03	01
43వ వార్డు	12	25	37	03	01
44వ వార్డు	06	45	51	04	00
45వ వార్డు	01	40	41	02	06
46వార్డు	05	23	28	00	00
47వార్డు	04	27	31	03	00
48వార్డు	06	34	40	03	02
49వార్డు	05	45	50	02	03
50వార్డు	00	33	33	03	01
51వార్డు	00	47	47	04	01
52వార్డు	06	35	41	04	00
53వార్డు	06	31	37	02	00
54వార్డు	07	34	41	04	02
55వార్డు	12	26	38	04	01
56వార్డు	08	35	43	04	01
57వార్డు	11	31	42	02	01
58వార్డు	11	31	42	03	05
59వార్డు	04	34	38	03	02
60వార్డు	05	39	44	04	00
61వార్డు	07	27	34	02	03
62వార్డు	03	28	31	01	01
63వార్డు	02	21	23	02	00

వైభవంగా దుర్గమ్మ-కుంచుమాంబ అమ్మవార్ల జాతర



ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులోని రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు, కోర్కెలు తీర్చే కల్పవల్లులుగా పేరొందిన కుంచుమాంబ, దుర్గమ్మ అమ్మవార్ల జాతర శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. తొలి పూజను గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించి భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, ఊర్వశికూడలి, గోకుల్‌నగర్, ఐటిఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు నాయకులు, సేవా సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగలు, ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. సాయంత్రం అమ్మవారి ప్రతిమలతో మూలవిరాట్ నుండి తిరువీధి మహోత్సవం నిర్వహించారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

సీతమ్మధార : విద్యుత్ చార్జీలు తగ్గించాలని, కరెంట్ కోతలు వద్దు అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం గురుద్వార వద్ద గల ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం సీఎండీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విజయబాబు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, జిల్లా కార్యదర్శి బోడ్డేపల్లి లలిత, 14వ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



బాటసారులకు మజ్జిగ అందిస్తున్న ప్రభాశర్మ

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు బాటసారులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ బస్‌స్టాప్ వద్ద వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ప్రభాశర్మ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, పాదచారులకు 100 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి రోజారాణి, కోశాధికారి షీలారాణి, ప్రోగ్రాం ఇన్‌చార్జి శిరీష లత, సురేంద్ర కౌర్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ జర్నల్ చీఫ్ ఎడిటర్‌గా కృష్ణా కళాశాల అధ్యాపకుడు



రామారావుకు నియామక పత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ స్టడీస్‌కు చీఫ్ ఎడిటర్‌గా ఆయన నియామకమయ్యారు. ఈ మేరకు సైన్స్ పత్రిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలు అధ్యాపకుడు కర్రి రామారావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామారావు అనేక అంతర్జాతీయ ప్రచురణలు, పుస్తకాల రచనతో పాటు సైన్స్ పత్రికలకు సంపాదకుడిగా, పర్యవేక్షకుడిగా పని చేస్తున్నారన్నారు. రామారావు కళాశాల కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజశేఖర్, రాజారావు పాల్గొన్నారు.

పరిశ్రమల సందర్శన

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే క్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణతో కూడిన అధ్యాపకుల బృందం పరవాడలోని మైలాన్ ల్యాబొరేటరీ లిమిటెడ్ పదవ యూనిట్‌ను మంగళవారం సందర్శించింది. ఈ మేరకు వీరు కంపెనీ హెడ్ ఎంపీఏ రామరాజు, హెచ్‌ఆర్ విభాగం డీజీఎం డి.బ్రహ్మాజీలను కలిశారు. కాలేజీ విద్యార్థులకు ఇండస్ట్రియల్ ట్రెనింగ్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికపై చర్చించారు. గైస్‌లోని ప్రయోగశాలల ఆధునికీకరణకు సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. వీటిపై కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ చెప్పారు. కార్యక్రమంలో గైస్ కెమికల్ ఇంజినీరింగు విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



55వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు వెంకటేశ్వర కాలనీ -1 సచివాలయం పరిధిలో గల గవర తాటిచెట్లపాలెం, సంతోషిమాత గుడి వీధి ప్రాంతాల్లో మంగళవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వార్డు కార్పొరేటర్ కేవీఎస్ శశికళతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి గడపకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హులైన పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని కేకే రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎం. సునీల్, రాయుడు శ్రీను, నూకరాజు, బోడ్డేటి గంగామహేష్, యడ్ల సిద్ధార్థ, కాయిత పైడి రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎడ్ల శ్రీనివాస రెడ్డి, సంతోష్‌కుమార్, తిరుపతిరావు, ఆళ్ల గోపి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతిపత్రం అందిస్తున్న అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట : ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి 'ఉద్యోగుల వేదనలను చెపుదాం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలువురు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించారు. మంగళవారం భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు తమ సమస్యల్ని నివేదిస్తూ, వినతి పత్రాలు సమర్పించినట్లు జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్ రావు, కార్యదర్శి సీహెచ్ రమేష్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, రెవెన్యూ సంఘ నాయకులు పీయూఎస్ మహేష్, సుధాకర్, రవి శంకర్, ఆర్‌టీసీ, వీఆర్‌ఏ సంఘ నాయకులు, పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

చరిత్ర పాఠ్యాంశాల తొలగింపు ఫాసిస్టు కుట్ర



మాట్లాడుతున్న పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్

సీతంపేట: మనుధర్మ శాస్త్రాన్ని పునరుద్ధరించేందుకే కేంద్ర ఫాసిస్టు పాలకులు చరిత్రను వక్రీకరిస్తున్నారని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 'శాస్త్రీయ చారిత్రక పాఠ్యాంశాల తొలగింపు' అంశంపై స్థానిక పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రం అన్ని సామాజిక వర్గాల్లోని మహిళలకు వ్యతిరేకమైందన్నారు. 2024లో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమల్లోకి తీసుకొస్తామని సంఘ్ పరివార్ శక్తులు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయన్నారు. ఇదే జరిగితే ఫాసిస్టు పాలన రావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, నాయకులు ఎ.ఎస్.నాయుడు, ఎ.ధర్మేందర్, సేవియర్ రెడ్డి, వీరభద్రరావు, అభిశ్రీ, వినోద్‌కుమార్, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి క్రీడలు దోహదం



కరాటే నేర్చుకుంటున్న పిల్లల్ని తిలకిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ



పిల్లలతో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: క్రీడలతో పిల్లలు ఉత్సాహంగా ఉంటారని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. వార్డులోని రైల్వే కాలనీలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. కిక్ బాక్సింగ్, కరాటే కోచ్‌లు బాక్సింగ్, కరాటేలను పిల్లలకు నేర్పించారు. అనంతరం ఆయన జీవీఎంసీ స్పెషల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మితో కలిసి శిబిరాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ మోనిషా పాల్గొన్నారు.

51వ వార్డులో...

చిన్నారులకు ఆటలు ఎంతో మేలు చేస్తాయని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. కరాటే, ఫిట్‌నెస్ కోచ్‌లు గౌరీశంకర్, వినయ్, గుడివాడ రాజు పిల్లలతో ప్రాక్టీస్ చేయించారు. పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని వెంకటరమణ అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్పెషల్ ఆఫీసర్ భరణి కుమార్, 290 సచివాలయం అడ్మిన్ సెక్రటరీ దేముడుబాబు, శానిటరీ సెక్రటరీలు జోసఫ్, హేమంత్, 288 సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ స్వామి, శానిటరీ సెక్రటరీ రేష్మా, పార్టీ నాయకులు శ్యామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులు



సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులతో కార్పొరేటర్ గోవింద్



లిప్పాన్ ఆర్ట్ అభ్యసిస్తున్న విద్యార్థులు

సీతంపేట: జీవీఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మర్ క్యాంపులు ప్రారంభం అయ్యాయి. స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ముఖ్య అతిథిగా మధురానగర్ జీవీఎంసీ ప్రైమరీ, హైస్కూల్ నందు సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్ని చదువుతో పాటు ఆటల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. అనంతరం బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, స్కూల్ డ్రిల్ మాస్టర్ తబితా, సచివాలయ సెక్రటరి వేణు, ఆశ వర్కర్ స్రవంతి, ఈశ్వరరావు, రాము పాల్గొన్నారు.

26వ వార్డులో...

జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రైమరీ, హైస్కూళ్లలో మంగళవారం సమ్మర్ క్యాంపులు ప్రారంభం అయ్యాయి. వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి కరాటే, బాక్సింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, సచివాలయ సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.

లిప్పాన్ ఆర్ట్‌పై శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం లిప్పాన్ ఆర్ట్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రీసోర్స్‌పర్సన్ జి.శిరీష లత పాల్గొని బాలబాలికలకు చిత్రాలకు రంగులు వేసే విధానాన్ని నేర్పించారు. మూడు రోజుల పాటు ఈ ఆర్ట్‌పై శిక్షణ ఇస్తామని శిరీష చెప్పారు. పిల్లలతో కథలు చదివించారు. గ్రంథాలయ అధికారిణి వై. పద్మజ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అబిద్‌నగర్ పార్కుకు కొత్త కళ



పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట పరికరాలు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డులో గల అబిద్‌నగర్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. అబిద్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ పార్కు నిర్వహణను పర్యవేక్షిస్తోంది. పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట పరికరాలు శిథిలమైపోయాయి. గత మార్చిలో అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన ఉగాది వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు దృష్టికి పార్కు అభివృద్ధి విషయాన్ని తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి పార్కు అభివృద్ధికి అవసరమైన నిధులు జీవీఎంసీ నుంచి మంజూరు చేయించారు. దీంతో పార్కులో పలు రకాల ఆట పరికరాలు అమర్చారు. పార్కు ప్రహరీకి రంగులు వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. మరికొన్ని పరికరాలు ఇంకా అమర్చాల్సి ఉంది. ఇది వరకే పార్కులో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. ఆస్క్ ఫౌండేషన్ కొన్ని ఆట పరికరాలను ఏర్పాటు చేసింది. దీంతో పార్కుకు కొత్త కళ వచ్చింది. 42, 43, 44 వార్డులో పిల్లల పార్కులు లేకపోవడంతో అబిద్‌నగర్ పార్కు ఒక్కటే పిల్లలకు ఆట విడుపుగా మారింది. చాలా కాలం తర్వాత ఆట పరికరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చెయ్యడంతో చుట్టు పక్కల ప్రాంతాల పిల్లలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ ఎంపీ, మంత్రిని అరెస్టు చేయాలి

సీతమ్మధార : దేశానికి పతకాలు, పేరు ప్రతిష్టలు తెచ్చిన భారత స్టార్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఏపీ మహిళా సమాఖ్య, పీవోడబ్ల్యు, సీఎంఎస్ విశాఖ జిల్లా మహిళా సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షులు వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, కార్యదర్శి ఇందిర, జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు లలిత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చదరంగం శిక్షణ



ఎత్తులు పైఎత్తులు వివరిస్తున్న ఉమాపతి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదిరోజుల ఉచిత చదరంగం శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. రెండవ రోజైన మంగళవారం శిక్షకులు సనపల ఉమాపతి విభాగాల వారీగా పిల్లలకు తరగతులు నిర్వహించారు. చదరంగంలో ఎత్తులు, పైఎత్తులను ఆయన వివరణాత్మకంగా విద్యార్థులకు చెప్పారు. కొత్త ఎత్తులు నేర్పించి హోమ్ వర్కు ఇచ్చారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.